
# అమెరి'కులాసా' కథలు
## - వంగూరి చిట్టెన్‌రాజు





# -45-
# రిపేరుకొచ్చిన రిఫ్రిజిరేటరూ-విడాకులిచ్చిన సియర్స్ కంపెనీ

**'విడాకుల' భాగం -ఆఖరి భాగం**

**గత నెలలో** జరిగిన కథ మీకు గుర్తు ఉంది కదా!. మేము పెద్ద గొప్ప కోసం కొనుక్కున్న పెద్ద బిల్ట్-ఇన్ రిఫ్రిజిరేటర్ క్రిందటి నెల ఒకానొక రోజున పడకేసింది. అనగా వంకాయలని చల్లగా ఉంచడానికి లోపల పెడితే మా క్వీన్ విక్టోరియా కి శ్రమ తగ్గించడానికి ఫ్రిజ్ లో ఉండగానే వాటిని వేయించేసింది మా ఫ్రిజ్. ఇక వాటి మీద ఉప్పూ, కారం వెసుకుని తినెయ్యవచ్చు కదా అని నేను అనుకుంటే "ఉప్పు తింటే చస్తావు" అని ఆవిడ నన్ను చావగొట్టబోతే నేను గత్యంతరం లేక దాని రిపేరు చేయిద్దాం అని మా ఘనత వహించిన సియర్స్ కంపెనీ వారిని పిలిచాను. వారి తరపున అప్పలనాయుడు & సన్స్ కంపెనీ వారి నీలం యూనిఫారం టెక్నీషియన్లు ఇద్దరు మా ఆగస్ట్ 15, 2020 నాడు మా ఇంటికి విచ్చేసి, రిపేరు కి కావలసిన ఆరు పార్ట్స్ ఏ చైనా నుంచో, జపాన్ నుంచో ఆర్డర్ చేసి నిష్క్రమించారు. అప్పటి నించే నేను చంద్రుడి కోసం చకోర పక్షిలా వారు ఆర్డర్ చేసిన ఇవాపొరేటర్ కాయిల్, డ్రైయర్, ఫిల్టర్ వగైరా ఆ ఆరు పరికరాల కోసం ఎదురుచూడడం మొదలుపెట్టగా నాలుగు వారాలు గడిచిపోయాయి.

ఆగస్ట్ 15, 2020 నుంచి నేను వారానికో సారి సియర్స్ వారిని పిలవడం, ఆ సామాగ్రి చైనా లో బయలు దేరిందో కనుక్కోవడం ఒక అలవాటుగా మారిపోయింది. ఇక్క విశేషం ఏమిటంటే అంత పెద్ద సియర్స్ కంపెనీ వారికీ కొన్ని వేల ఫోన్ నెంబర్లు ఉంటాయి అనుకుంటే మన పప్పులో కాలు వేసినట్టే. వారు నాలాంటి అర్భక వినియోగదారులకి ఇచ్చేది ఒకే ఒక్క నెంబర్. ఆ నెంబర్ పిలవగానే ఇక నొక్కుల పర్వం మొదలవుతుంది. ఈ రోజుల్లో అయితే ముందుగా పది నిముషాలు కరోనా ప్రవేటు. ఆ తర్వాత

మీ ఇంట్లో మైక్రోవేవ్ పాడయితే ఒకటి నొక్కు, పిల్లి కి దగ్గులు వస్తుంటే మూడు సార్లు నువ్వు కూడా దగ్గు, మీ క్వీన్ విక్టోరియా కోప్పడుతూ ఉంటే గరాజ్ లోకి పారిపో" ఇలా మనకి లేనిపోని కష్టాలకి నికృష్టమైన సలహాలు చెప్పి, ఆఖరికి పది, పదిహేను నొక్కుల తర్వాత ఎక్కడో ఫిలిప్పీన్స్ వారో, కొండొకచో మన పవిత్ర భారత దేశం వారో ఆ ఫోన్ ఎత్తుతారు.

ఇక అప్పటి నుంచీ మన ప్రవర మొదలు. నీ పేరేమిటి, గోత్రం ఏమిటీ, మీ అమ్మమ్మ పుట్టింటి పేరు, చచ్చిపోయిన మీ కుక్క ఎప్పుడు పుట్టిందీ...ఇవన్నీ అడిగి, నేను నేనే అని నిర్ధారించుకుని కానీ" "ఇంతకీ ఎందుకు పిలిచావు బామ్మరిదీ?" అని కానీ అసలు విషయానికి రారు. అంతా సెక్యూరిటీ కోసం ట. నా బొంద సెక్యూరిటీ. ఈ అరగంట సంభాషణ లోనూ ఏ అంశం అయినా మా క్వీన్ విక్టోరియా చెవిన పడిందో ఇక అంతే సంగతులు. ఉదాహరణకి ఒక సారి ఆ ఫోన్ అమ్మాయితో "మా చచ్చిపోయిన కుక్కని ఆరేళ్ళ క్రితం పెంచుకున్నాం, ఎప్పుడు ఎవరికి పుట్టిందో తెలీదు" అని నేను వ్యంగ్యంగా సమాధానం చెప్తూండగా అది ఆవిడ చెవిని పడి "ఏయ్, మొగుడూ, ఎందుకు అలా అబద్ధాలాడతావ్. అప్పుడు క్రిస్మస్ పండగకి మా తమ్ముడింటికి డాలస్ వెళ్ళినప్పుడు వాడికి పుట్ట లేదూ..అదేలె..వాడంటే వాడికి కాదు. వాడింట్లో జూలీ కి డజను పిల్లలు పుడితే ఈ బుజ్జి గాడిని తెచ్చుకున్నాం కదా. డిశంబర్ 25, 2013..అప్పుడే మర్చిపోయావా?....అని అరవడం, అది ఆ పిల్ల వినడం. ఇదీ వరస. అసలు ఆ చైనా పిల్లని ఎందుకు పిలిచానో అని అప్పటికే నేను మర్చిపోయాను.

మొత్తానికి రిపేరు కొచ్చిన రెండు నెలలకి...అనగా... అక్టోబర్ 15, 2020 నాడు మరొక ఇద్దరు టెక్నీషియన్ వారు వేంచేసారు. వీరి యూనిఫారం పసుపు రంగు. ఈ ఇద్దరూ లోపలికి వచ్చి మా పని చెయ్యని ఫ్రిజ్ చూడగానే డంగ్ అయిపోయారు. వాళ్ళ మొహాలు పేలవంగా అయిపోయాయి. మాట పడిపోయింది. కాస్సేపటికి ఒకడికి మాట పెగిలి "సర్. ఇది జెనరల్ ఎలక్ట్రిక్ వారి మోనోగ్రామ్. ఇది రిపేర్ చెయ్యడానికి మాకు అర్హత లేదు. దానికి వేరే వాళ్ళు కావాలి" అనేసి ఇద్దరూ జారుకున్నారు. ఆ సమయం లో మా క్వీన్ విక్టోరియా ఇంట్లో లేకపోవడం వారిద్దరి పూర్వజన్మ సుకృతం. నేను ఉండి, నరక యాతన అనుభవించడం ఎప్పుడో నేను చేసిన మరొక పాపం!.

ఇక నేను మా డైనింగ్ బల్ల మీద పెట్టిన ఆ ఆరు రిఫ్రిజిరేటర్ పరికరాలనీ చూసి, వాటికి ఇంకా మోక్షం కలగనందుకు విచారిస్తూ మళ్ళీ మరొక గంటన్నర మరొక ఫిలిప్పీన్స్ అబ్బాయి తో మాట్లాడగా ఈ సారి మరొక నెల రోజుల్లోనే, అనగా నవంబర్ 15, 2020 మరొక టెక్నీషియన్ వచ్చాడు. ఈయన టెక్నిక్ వేరంటే వేరు. ఈ ఎర్ర బట్టలు వేసుకున్న తెల్ల కుర్రాడిది ట్రంప్ గారి పార్టీ ఏమో కానీ, ఎందుకో ఈ తూ.గో. జిల్లా బాపతు పెద్ద మనిషి ఇంట్లో పని చెయ్యడం ఇష్టం లేదు అని అని వారు ఇంట్లో అడుగుపెడుతూనే నాకేసి విసిరినా చూపులోనే నాకు అర్థం అయిపోయింది. ఒక ముసుగు కరోనా కోసం అయితే మరొక ముసుగు మా వంటింటి మసాలా వాసన కోసమూ వేసుకుని, ఉన్న తోలు బూట్ల మీద మరొక ప్లాస్టిక్ తొడుగులూ వేసుకుని, వీధి గుమ్మం లో అడుగుపెట్టి పదడుగుల దూరం లో ఉన్న వంటింట్లోకి రావడానికి అర గంట పట్టింది ఈ మానవుడికి.

ఈ విధంగా ఏదేదో వ్రాసి ఇక్కడ మన భారతీయులని, ముఖ్యంగా మనసు నొప్పించి ఉంటే మన్నించాలి. ఎందుకంటే మనం వంటింటి వాసన మనలాటి వాడే మరొకడి ఇంటికి వెళ్లి గుమ్మం తలుపు తియ్యగానే గుప్పుమని కొట్టే

పోపు ఘుమ ఘుమల సంగతి ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం లా దేశం అంతా తిరిగిన నాకు బాగానే తెలుసుసు. శాకాహారుల ఇళ్ళకీ, కాని వాళ్ళ ఇళ్ళకీ కాస్త ఫ్లేవర్ మాత్రమే తేడా. నాలాగా ఎన్ని రకాల సువాసననాభారితమైన ద్రవ్యాలూ, వాయు పదార్థాలూ గాలిలో కొట్టినా సియర్స్ కంపెనీ వారి జాగిలాలు నిపుణులు ఇట్టే పసిగట్టేస్తాయి. అయినా ఆ సంగతి చెప్ప లేక ఈ వీరుడు కొత్త పాట అందుకున్నాడు. దాని పేరు ఇన్స్యూ రెన్స్ పాట. “మీది బిల్ట్ –ఇన్ రిఫ్రిజిరేటర్ కావున అది బిల్ట్ అవుట్ ఆయె దాకా మేము దాన్ని ముట్టుకోడానికి మా ఇన్స్యూరెన్స ఒప్పుకోదు” అన్నాడు ట్రంపు గాడు. “అంటే ఏమిటంటావ్?” అని నేను నోరు విప్పేలోగానే వాడు సాక్షాత్తూ మా వంటింట్లోనే ఆ తోలు తొడుగులు విప్పేసి “అంటే నువ్వు ఆ జి,ఇ. వారి మోనోగ్రామ్ వారి ఆ ఫ్రిజ్ ని దాని కన్నం లో పూర్తిగా దాని వెనక భాగము నాకు అందుబాటు లో ఉండేటట్టు నుంచి బయటకి లాగుము. అప్పుడు నేను రిపేరు చేయుదును. పది రోజుల తరువాత నేనో, మరొక వెధవో వచ్చెదము. అంత వరకూ శలవ్” అని వాడు తన కాలి జోళ్ళ తొడుగులు మా వంటింట్లోనే విప్పేసి, అక్కడ చెత్త డబ్బాలో పడేసి దండకారణ్యాలకో, హిమాలయాలకో ఎక్కడికో వెళ్ళిపోయాడు. దాని దుంప తెగా! అసలు జోళ్ళు వేసుకున్న ఆ కుర్ర వెధవని వాడిని వంటింట్లోకి రానివ్వడం మా ఇంటా వంటా లేదు కదా అని అప్పుడు కానీ నాకు జ్ఞాపకం రానే లేదు. అసలు అమెరికాలో అడుగు పెట్టగానే, మడీ, తడీ, అంటూ, సొంటూ, ఎంగిలీ, గింగిలీ ఇలా అన్నీ అటక ఎక్కేశాయి. మరి కరోనా అందరికీ అంటుకుంటోంది అంటే కుంటదూ?

ఇక మరొక తతంగం ప్రారంభం. నేను ఎందుకైనా మంచిది అని పై తతంగం అంతా చెప్పకుండా, ఇంకా ఎందుకైనా మంచిది అని మా క్వీన్ విక్టోరియా వంటింట్లోనే ఉండగా ఏమీ తెలియనట్టు ఓవర్ ఏక్షన్ చేస్తూ ఆ కన్నం లో ఇరుక్కుపోయిన ఆ భారీ రిఫ్రిజిరేటర్ ని ప్రేమగా కాలిలించుకుని బయటకి లాగబోయాను. వాడు చెప్పాడు కదా మరి!.

“ఏమిటా వెకిలి వేషాలూ?” అనేది మా క్వీన్ విక్టోరియా మొదటి స్పందన.

“నడుం విరిగి చస్తావ్” అని రెండో హెచ్చరిక.

“పోనీ ఓ చెయ్యి వెయ్యకూడదూ, దీన్ని బయటలకి లాగాలి”– ఇద్దరం కలిపి లాగితే అది బయటకి రాక చస్తుందా అని నా అసలు ఆలోచన బయట పెట్టాను.

“అప్పుడు నేను నడుం విరిగి చస్తాను. ఆ వెధవని పిలు” అని ఆవిడ ఉచిత సలహా. ఆ పిలుపు కి అర్హత ఉన్నవాడు మా సుపుత్రుడే!

పాపం , ఎక్కడో వంద మైళ్ళ దూరంలో ఆస్టిన్ లో ఉన్న తన కన్న కొడుకుని ఈ వంక పెట్టి అయినా ఈ వారాంతం ఇంటికి రప్పించుకుందాం అనేది ఆవిడ ‘దూరాలోచన’. మొత్తానికి మా సుపుత్రుడు వచ్చి నాలుగు పీకితే కానీ ఆ ఫ్రిజ్ బిల్ట్ ఇన్ నుంచి బిల్ట్ ఔట్ అవలేదు. మళ్ళీ నేను ఫోన్ మీద ఈ మంచి వార్త ఫిలిప్పీన్స్ వారి చెవిని వెయ్యడాని కి మరొక వారం పట్టింది. కానీ నా అమెరికేకలు అంత దూరం వినపడ లేదో ఏమిటో కానీ మరొక పది రోజులు అంతా

నిశ్శబ్దం. ఎక్కడా సియర్స్ వారి నుంచి ఉలుకూ పలుకూ లేదు. ఏమయిందిరా బాబోయ్ అని గూగులమ్మని అని అడగ్గానే "సియర్స్ వారు కిందటేడాది దివాళా చేశారోచ్" అని ఆ మహా తల్లి కెవ్వు కేక పెట్టింది. అది వినగానే బావుండదు అని తను కూడా ద్విగుణీకృతమైన..అనగా రెట్టింపు ఉత్సాహంతో "ఏం మొగుడూ, కాపరం గరాజ్ లోకి మార్చేస్తావా. అక్కడి బుజ్జి ఫ్రిజ్ బాగానే పని చేస్తోంది.నీకు అది చాలు. ఇక్కడికి నేను కొత్తది ఇక్కడికి కొనుక్కుంటాను" అని గంగవెర్రులెత్తి పోయింది మా క్వీన్ విక్టోరియా సియర్స్ వారి దివాళా వార్త వినగానే.

ఇక నేను విజృంభించి ట్రంప్ గారి నుంచి బెటర్ బిజినె బ్యూరో వారి దాకా వాకబు చేసి కనుక్కోగా అసలు సంగతి ఏమిటంటే టా....అసలు సియర్స్ వారు అప్పుల బారి నుంచి తప్పించుకోడానికి దివాళా పత్రాలు కోర్టు వారికి సమర్పించారు ట కానీ ఈ ఇంటి రిపేర్ల విభాగం అందులోకి రాదుట. అంచేత మా జి.ఇ. వారి మోనోగ్రామ్ ఫ్రిజ్ రిపేర్ వారు చెసి తీరాలి ట...

అప్పుడు నేను నవ్వాలో, ఏడవాలో తెలియక మళ్ళీ ఆ ఫిలిప్పీన్స్ అమ్మాయిని తగులుకొనుటా, ఈ సారి ఆమె దయ తలిచి ఆ దిక్కుమాలిన ఫ్రిజ్ రిపేర్ కి కావలసిన సామాగ్రి అంతా పేరు పేరునా, పార్ట్ నెంబర్ లెక్కనా, రంగు, సైజు, వాసనల లెక్కనా సరి చూసుకుని డిశంబర్ 15, 2020 నాటికి మరొక రిపేరు వాడు మా ఇంటికి వచ్చేటట్టు ఏర్పాటు చెయ్యగానే నేను సంతోషం పట్ట లేక "ఇక నువ్వు ఇంటికి వెళ్ళిపో వచ్చును లే" అనగానే అంత వరకూ నాతో ఎంతో గంభీరంగా మాట్లాడిన ఆ పిల్ల కిచ కిచా నవ్వేసింది.

అప్రస్తుతమే కానీ, ఇక్కడ ఒక వ్యక్తిగత రహస్యం చెప్తాను. నేను పొద్దున్న తొమ్మిందింటికి ఏదైనా పని మీద బేంక్ కి వెళ్ళి, ఆ పని అవగానే అక్కడి తెల్లటి, టెల్లర్ పిల్లకి అయినా, పోస్ట్ ఆఫీసుకి ఉచిత పుస్తకాల పంపిణీ పథకం ద్వారా ఎవరికైనా తెలుగు పుస్తకాలు పంపించినప్పుడు ఆ పని అవగానే, అక్కడి నల్ల పిల్లవాడికైనా, కూరలు కొనుక్కోడానికి పటేల్ సోదరుల దుకాణానికి వెళ్ళినప్పుడు ఆ పని అవగానే అక్కడి మన గోధుమ రంగు గంగా బెన్ కీ అయినా "నౌ యు కెన్ గో హోమ్" అంటాను. అనగానే అంతవరకూ సీరియస్ గా పనిచేస్తున్న వాళ్ళందరూ కిసుక్కున నవ్వేసి సంతోషిస్తారు. కష్టపడి చాకిరీ చేస్తున్న వాళ్ళకి చిన్న నవ్వు తెప్పించే ఈ టెక్నిక్ సరదాగా ప్రయత్నించండి...

మళ్ళీ కథలోకి వస్తే.... ఈ సారి పాపం సియర్స్ వారు బాగా పేరున్న పెద్ద రిపేరు కంపెనీ పెట్టుకునే స్తోమత బహుశా లేక, దివాళా స్తితిలో ఉన్న కారణంగా మా ఇంటికి వచ్చిన వాళ్ళు ఇదివరకటి వాళ్ళలాగా పెద్ద ట్రక్ లలో కాకుండా, మామూలు జనతా క్లాస్ వారి చెవర్లెట్ లాంటి చిన్న కారులో కావలసిన పటకార్లూ, స్క్రూ డ్రైవర్లూ చిన్న డిక్కీ లో సద్దుకుని విచ్చేశారు. అప్పటికే మా వంటింటి మధ్యలో గత నెలకి పైగా వారి రాక కోసం నిస్సహాయంగా ఎదురు చూస్తున్న మా జి.ఇ. వారి బిల్ట్ ఔట్ మోనోగ్రామ్ వారికి నిశ్శబ్దంగానూ, నేను అనుమానాస్పద హృదయ ప్రకంపనల తోటీ స్వాగతం పలికాం. ఏనాడో బైపాసులూ, స్టెంటులూ, పేస్ మేకర్లూ లాంటి ఆటలు ఆడేసుకున్న నా గుండె కాయ

కొట్టుకోడం లో ప్రకంపనలు ఉండే అవకాశం లేదు కానీ ఈ వీరులిద్దరూ మా కాకినాడ రంగు వారు అవడమే కాక వేసుకున్న బట్టలు కాషాయం రంగువే అయి ఉండడమే అని చెప్పక తప్పదు. కావాలంటే వారి ఫోటో ఒకటి ఇక్కడ పెట్టాను.

ఇక ఈ వీరులిద్దరూ దాని కిందా, మీదా పడి, లోపలి పార్టులు బయట పారేసి, కొత్త పార్టులు లోపల పారేసి రిపేరు చేసేయ్యగానే అంత వరకూ భాగా భగ భగా భగ్గుమంటున్న ఆ స్టెయిన్లెస్ లెస్ స్టీల్ డబ్బా హఠాత్తుగా చల్లబడిపోయి, వెలిగి పోయి అచ్చు ఆ ఫిలిప్పీన్స్ అమ్మాయి ఇంటికి వెళ్ళిపోతూ కిచ కిచ లాడినట్టు కాస్సేపు ఊగిసలాడి, లాడ లేక, లాడీ లాడ లేక మొత్తానికి మా వంటింట్లో మళ్ళీ విదులలోకి ప్రవేశిస్తున్న సం'కేతాలు ఇచ్చింది. అదెలా అంటే నేను అది పని చేస్తోందో లేదో అని సరదాగా మంచు ముక్కలు వచ్చే ఫ్రీజర్ సెక్షన్ లో చెయ్యి పెట్టగానే అది



క్షణం లో వేళ్ళు కొంకర్లు పోయి చెయ్యి మొత్తం చికాగో లో శీతాకాలం లో అరటి దూటలా కొయ్యబారి పోయింది. ఇంకా నయం కాలు పెట్టాను కాదు అని నేను దాన్ని పైకి లాక్కుని కుంపటి మీద పెట్టి చెయ్యి కాల్చుకునే లోపుగానే ఆ వీరులలో ఒహడు చెక్కు ఇస్తావా, క్రెడిట్ కార్డా అని ఒహటే గోల.

'ఏ పేరు మీద రాయమంటావ్ చెక్కు" అని అడిగాను వాడి సతాయింపు భరించ లేక, అప్పటికి చేతి వేళ్ళు కాస్త కదలడం మొదలుపెట్టాక.

"మోడీ రిపేర్స్'. ఒక కాషాయం వాడి సమాధానం.

"వాట్?"

"యస్. ప్లీజ్ మేక్ ది చెక్ టు మోడీ రిపేర్స్"

"మరి సియర్స్ వారేమయ్యారు?"

" వుయ్ డైవోర్సేడ్ దెమ్!"

సియర్స్ వారికి ఈయన విడాకులు ఇచ్చిన సమాచారం ఆ విధంగా నాకు అందగానే, అది విని నేను మొహం అదోలా పెట్టి, అష్టవంకర్లూ తిరిగిపోతూ ఉంటే..ఆ రెండో వీరుడు ముందుకు వచ్చి "నో, నో, సియర్స్ కంపెనీ డైవెస్టెడ్ దైర్

రిపెర్స్ డివిజన్..అనగా అమ్మేశారు. నాట్ డైవోర్సేడ్.... . అవర్ ఇండియన్ బాస్ పర్చేస్డ్ ఇట్..." అని చెప్పి ఇప్పుడు సదరు సియర్స్ కంపెనీ వారు సొంత రిపేరు విభాగాన్ని అమ్మేశారు అనీ, అది కొనుక్కున్నా ఈ కంపెనీ ద్వారా రిపేర్లని చేయిస్తారు అనీ, దాని బాస్ మోడీ అనే ఇండియన్ పెద్ద మనిషి అనీ వివరణ ఇచ్చాడు. అసలు చిన్న చెవర్లెట్ కారు డిక్కీలో పటకార్లు, స్క్రూ డ్రైవర్లు చూసినప్పుడే నేను ఈ విషయం ఊహించ లేక పోతిని కదా అని ఇప్పుడు విచారంగా ఉంది.

ఏది ఏమైనా భారత ప్రధాన మంత్రి గారికి వంద డాలర్ల సర్వీస్ ఛార్జ్ ఇవ్వడం తో ఈ నూతన సంవత్సరం ప్రారంభం అవడం మహానందంగా ఉంది. మా జి,ఇ. వారి మోనోగ్రామ్ మళ్ళీ బిల్ట్ ఇన్ స్థాయిని సంపాదించుకుని మమ్మల్ని చల్లగా చూడడం అంతకంటే మహానందంగా ఉంది.

అందరికీ నూతన సంవత్సర శుభాభినందనలతో....

**COMMENTS**